# రహస్యం

శ్రీమతి ఉమాశశి

ఈ విషయం తాతయ్యా నాకెందుకు చెప్పనట్లు? ఆలోచించి నా మెదడు మొద్దుబారింది. సమయం వచ్చినప్పుడు చెబ్దామనుకున్నారేమో! అంతే అయుంటుంది...ఇంతకీ.

అరవయ్యేళ్ళ తాతయ్యగారికీ నాకూ దోస్తీ. తాతయ్యగారు నాకు స్వంతబంధువు కాదు. నాన్నగారికి చదరంగం స్నేహితుడు. మా ఇళ్ళు పక్క పక్క వీధుల్లోనే. ఇంచుమించు తాతయ్య గారింట్లోనే ఉండేదాన్ని. ఆయన జమీందారు గాబట్టి అన్నీ ఆయనవి జమీందారీ లక్షణాలే. నాటి జమీందార్ల రక్తం ప్రవహించకపోయినా నాలో వున్న సభ్యత, సంస్కారం ఆయనకి చాలా నచ్చి నన్ను దగ్గరకు తీశారు. అంతా ఆయన కనువుగా ప్రవర్తిస్తాను. ఆయన హుందాతనం ముఖ్యంగా మంచితనం నాకిష్టం. మా నాన్నంటే ఆయనకు చాలా ఇష్టం. మా నాన్న చాలా తెలివైన వారనీ ఆయన తెలివంతా నాకు వచ్చిందని తాతయ్య ఉద్దేశం.

చనువు ఇస్తున్నారుకదా అని నెత్తికెక్కే వాళ్ళంటే ఆయనకు పరమ అసహ్యం. నేనూ ఆ కోవకి చెందిన దాన్నయితే ఆ ఇంటి గడప తొక్కే అవకాశం కలిగేది కాదు. ఆయన చాలా విజ్ఞాని. ఎన్నో పుస్తకాలు చదివారు. ఇప్పటికీ చదువుతారు. అప్పుడప్పుడు నాచేత చదివించుకుంటారు. ఇలా పుస్తకాల మీద వున్న ఆసక్తి వల్లనే మేమిద్దరం స్నేహితులమయ్యాం. ఎన్నో విషయాలు చెప్పేవారాయన. అన్నీవినేదాన్ని. అలా వినడం సరదా నాకు.

సభ్యతకీ, సంస్కారానికి ఆయన ఎంతో విలువనిస్తారు. నాకు జ్ఞానం వచ్చినప్పటినుంచి ఆయనతో నా పరిచయం, ఆ తర్వాత స్నేహం.

ఇప్పటికీ వాళ్ళింటికి వెడితే నౌకరుతో చెప్పిగాని లోపలికి వెళ్ళను.చెప్పాపెట్టకుండా లోపలికి వెళ్ళడం మంచిపని కాదు. అది ఆయనకు నచ్చదు. రేడియోలో చిమం ప్రోగ్రాంవున్నా అడిగి అనుమతి తీసుకుని గాని రేడియో పెట్టను. అన్నిగదుల్లోకీ వెళ్ళి బల్లసొరుగులు లాగెయ్యడం, కాయితాలు పెట్టుకునే చోటుకు వెళ్ళి అవన్నీ పుణికెయ్యడం నా మతానికి విరుద్ధం.

పరాయి ఇంటికెడితే చనువు పేరుతో వంటింట్లోకి జొరబడి ఆ డబ్బా, మూతలు తీసి చూడడం, ఇవన్నీ సభ్యతా లక్షణాలు కావు నా దృష్టిలో కూడా. ఆయనకీ ఇష్టం లేనివి. ఇలా తత్వాలు కుదరబట్టే మాకు దోస్తీ కుదిరింది.

అటువంటి స్నేహం మాది. అలాంటప్పుడు ఈ విషయం, నాన్న చెప్పినపుడు తెల్లబోయాను.

"దత్తత చేసుకుందామన్న ఉద్దేశం ఉందట. ఎవరో కుర్రాడు వస్తున్నాడట మరో వారంలో" అన్నారు నాన్న.

"అహా" అన్నాను.

"నీకు తెలీదూ?"

"ఉహు"

"ఇవాళ చెప్తారేమోలే" అన్నారు.

"కాబోలు"

నా నిరాసక్తత చూసి నాన్న ఏమీ మాట్లాడకుండ వెళ్ళిపోయారు. అమ్మ ఇచ్చిన కాఫీ తాగి మామూలుగా తాతయ్యగారింటికి వెళ్ళాను.

కాసేపు పిచ్చాపాటీ అయ్యాక అడిగారాయన.

"అమ్మాయ్ అందరూ అనుకుంటున్నమాట విన్నావా?"

"విన్నాను తాతయ్యా. ఎవరా అబ్బాయి?"

"నా స్నేహితుని కొడుకు. స్వీడన్‌లో చదువుకున్నాడు. నాలుగురోజుల్లో వస్తాడిక్కడికి"

"అంత పెద్దబ్బాయా?" అన్నాను ఆశ్చర్యంగా.

"కాక ... ఈ వయస్సులో చిన్న పిల్లాడయితే పెంచగలనా? ఈ అబ్బాయయితే కాస్త అసరా" అన్నారాయన.

నేనేం మాట్లాడలేదు. మళ్ళీ ఆయనే అన్నారు.

"నువ్వే మగపిల్లవాడయివుంటే నిన్నే పెంచుకుందునే అమ్మాయ్"

"వద్దులే తాతయ్యా ... ఆ పెంపకానికి వెళ్ళడం, అదీ నాకు పరమ చిరాకు"

"ఎందుకో? నేను పెంచుకున్నా రావా?"

"ఉహూ...మా అమ్మని వదిలి నేనుండలేను బాబూ" అన్నాను.

"ఓహో! అలాగా! అయితే రేపు మొ...

"తాతయ్యా! స్టాప్, స్టాప్...నాకు కోపం ఒచ్చేస్తోంది" అన్నాను.

ఇద్దరం నవ్వుకొన్నాం.

"అది సరేగానీ. రేపు ఆ అబ్బాయి వస్తే కాస్త కొత్తగా మొహమాటంగా ఫీలవుతాడేమో...ఇంట్లో కలిసిపోయేట్టు చూడు"

తల ఊపాను.

ఆ మంచిరోజు రానే వచ్చింది.ఆ అబ్బాయి రావడానికి గంటముందే ఒచ్చెయ్యమన్నాడు తాతయ్య. ఆ పూట భోజనం వాళ్ళింట్లోనేట. పైకి తేలకపోయినా తాతయ్య బలే సంతోషంగా వున్నట్లు పసిగట్టాను.

సరే ... స్వీడన్‌దొరబాబు దిగాడు చూస్తూనే ఆశ్చర్యపోయాను. కళ్ళు చెదిరిపోయేంత అందం. చాలా పొడుగ్గావున్నాడు పొడుగుకి తగ్గ లావు. ఎర్రగా వున్నాడు అతని పేరు రమేష్.

అతనికన్నీ చూపాను. క్రొత్తలేకుండా కలిసిపోయాడు వచ్చిన అరగంటలోనే.

ఆ తర్వాత అతని ప్రవర్తనవల్ల మనస్తత్వం కనిపెట్టేసాను. తాతయ్య తత్వానికి పూర్తి విరుద్ధం. ఆ రోజే...కాఫీలవేళ చెప్పులతోనే వంటింట్లోకి వచ్చేసాడు.తాతయ్యకు బొత్తిగా ఇష్టంలేని పని అది. అందుకే తాతయ్యవైపు చూశాను. ఆయన పరిస్థితిని చూచి నవ్వొచ్చింది. చెప్పలేని స్థితికదా!

"మీకాఫీ నేను మీకు గదిలోకి పంపు తాను. ఇక్కడికెందుకు రావడం" అన్నాను.

"అరె...ఎందుకు? ఇక్కడ కూర్చుంటా

"అయితే చెప్పులు బయట వదిలి రండి. ఇది వంటిల్లు" అన్నాను.

"పూలిష్‌పెలో ... ఇంకా ఏమిటీ మూఢా చారాలు? నాకవన్నీ నచ్చవు" అన్నాడు.

"మూఢాచారాలుకావు. శుభ్రంగావుండటం. చెప్పులు వదిలేసి రండి. ఇది వంటిల్లేకాదు. పూజామందిరంకూడా" అన్నాను.

"ఇదింత అడ్డగాడిదేమా?" అన్నట్లు ఓ చూపు పారేసి వెళ్ళిపోయేడు.

హాయిగావుంది అతను వెళ్ళిపోతే. వెళ్ళ డమో. ఎందనలోకి దిగుతాడేమో భగవంతుడా అనుకున్నాను. ఫర్వాలేదు. రక్షించాడు. అను కున్నంతసేపు పట్టలేదు. మరో ఉరుము... తాతయ్యకిష్టంలేని మరోపని. రేడియో గట్టిగా పెట్టడం. తాతయ్యకన్నీ సున్నితంగా వుండాలి. రేడియో సన్నగా మోగాలి. అలా తరంగాల్లా తేలి తేలి వినబడాలి సంగీతం. ఇట్లా హిప్పీజుట్టులాంటి పాటలంటే తలనొప్పి తాతయ్యకి.

నావైపుచూశారు తాతయ్య. ఇంక తప్పదు ఈ ఉప్పెనని నేనే ఆపాలి. వచ్చి అరపూట కాలేదు. ఇలా పెంకులెగిరిపోయేటట్లు చప్పుడు. ఎలా?

గబ గబ సావిట్లోకి వెళ్ళి రేడియోగొంతు తగ్గించాను. కయ్యిమన్నాడు దొరబాబు.

"ఎందుకు తగ్గించావు? ఆ సంగీతం నాకు ఇష్టం"

"తగ్గించి వినొచ్చు. చెవులు చిల్లులు పడు తున్నాయి. తాతయ్యగారికి అంత శబ్దం పనికి రాదు"

"పనికిరాకపోతే..."

ఏమంటాడోనని భయంవేసి నేనక్కడ నుంచి వచ్చేశాను. గుండె దడదడ లాడింది మొదటిసారి.

ఇంత ఇతరుల అభిప్రాయాలకు విలువ ఇవ్వని మనిషిని తాతయ్య ఎలా భరిస్తాడు? కానీ. నాకెందుకు?" కొడుకు కావాలనుకుంటే ఇటువంటివన్నీ భరించదలచుకున్నారేమో ఆయన! ఆలోచనకి నవ్వుకున్నాను. కొడుకు కావాలనుకునేసరికి సర్దుకోవడం మొదలు పెట్టేస్తారు గావును.

రెండురోజులు గడిచాయి. ఈ రెండురోజు ల్లోనూ అన్నీ తాతయ్య కిష్టంలేని పనులే చేశాడా దొరబాబు. నేనేమీ అడ్డు చెప్పలేదు. తాతయ్య కిష్టమయినంతవరకు ఎవరూ ఎవర్నీ అడ్డుపెట్టలేరు కదా! నేననుకున్నట్లు ఆయన పాపం సర్దుకోవాలనుకుంటున్నారు కదా! ఇంక నాకెందుకు? ఆ రెండురోజులుపనులన్నీ అయ్యాక తాతయ్య నాకు కేటాయించిన గది లోనే వుండిపోయేదాన్ని.

మూడోరోజు పొద్దున భోజనాల గదిలో కూర్చుని కాఫీ తాగుతున్నాం. సావిట్లో రేడియో గట్టిగా మోగుతోంది. గట్టిగా వున్నా సరిగాలేదు. పక్కపక్క స్టేషన్లు కలిసిపోయి ఒకటీ బాగా వినపడ్డంలేదు. నాకు తిక్కరేగి తక్కున లేచివెళ్ళి సరిచేసి వాల్యూం తగ్గించి వచ్చాను.

'అబ్బ ... ఏంత మంచిపని చేశావ్?' అన్నారు తాతయ్య. నవ్వేశాను.

చాలా గంభీరంగా వున్నాడు రమేష్. ఆ గంభీరత వెనక ఏదో వుందనుకున్నాను.

అనుకున్నట్లుగానే ఓ ప్రశ్న వేశాడు తాతయ్యని.

"విల్లు రాశారా?"

పిడుగు రాలింది. ఎంత అసహ్యకరమైన ప్రశ్న! తాతయ్య మొహంలోకి ఇంక చూడ లేకపోయాను. జెట్ వేగంకన్న ఇంకా ఎక్కువ వేగంగా కొట్టుకుంటోంది నా గుండె. ఏదోఏదో జరిగిపోతుందనుకున్నాను. ఏం జరం లేదు. మెల్లిగా, భయంగా తాతయ్య మొహంగ లోకి చూశాను. నిర్వికారంగా వున్నారాయన. ఏమాత్రం తొణకలేదు. మొహంలో కోపం గాని. బాధగాని. దుఃఖంగాని. అసలేభావమూ లేదు.

"సమాధానం చెప్పరేం? నాకన్నీ ముందే తెలియాలి. మీఆస్తి వివరాలన్నీ నాకు చెప్పాలి. అన్నివిషయాలు తెలీకుండా పెంపుకి రావడం నాకిష్టంలేదు" అన్నాడు. స్వీడన్. అమెరికా వగైరా దేశాలు తిరిగి చదువు నేర్చుకుని సంస్కారం వంటబట్టించుకొచ్చిన రమేష్.

'రాయలేదు' అన్నారు తాతయ్య.

నాలుగే అక్షరాలు. ఎంత భారంగా సమా ధానం చెప్పారో తాతయ్య. అర్ధంచేసు కున్నాను. మనిషిలో వ్యధ. ఆ అక్షరాలు చెప్పాయి నాకు.

రమేష్ తల్లిదండ్రులిద్దరూ చాలా మంచి వాళ్ళు. సభ్యతా సంస్కారం గలవాళ్ళని తాతయ్య చెప్పారు నాకు. మరి ఈ దొరగారిలో ఈ గయ్యాళితనం ఎక్కడిదో?

"అయితే ఎలా? వెంటనే విల్లు రాయండి. ఆస్తి మూడొంతులు నాపేరనే వుండాలి. మా నాన్న మెత్తన. ఇవన్నీ మాట్లాడలేడు. మీ రంటే ప్రేమ ఆయనకి. ఏం చెప్పలేడాయన. అందుకే స్వయంగా నేనే మాట్లాడదా మను కున్నా" అంటూ చెప్పబోయాడు.

"సరే, సరే, అట్లాగే" అంటూ మెల్లగా లేచి డైనింగ్ రూము దాటాడు తాతయ్య.

చప్పగా తయారయింది కాఫీ. నోటి కెక్కడంలేదు. ఎదురుగా ఆ పెద్దమనిషి. లేచి వెళ్ళడమూ, మానడమూ తెలీలేదు నాకు.

'తాతయ్యగారు పిలుస్తున్నారమ్మా' అంటూ దేవుడల్లే వచ్చి పిలిచాడు నౌకరు.

అమ్మయ్యా! కాఫీ అక్కడక్కడే వదిలేసి ఒక్కవురుగులో అగది దాటాను.

With the best Compliments from : PHONE : 75143

FINE chemists

PHARMACEUTICAL DISTRIBUTORS

Stockists for : MICRO LABS PRIVATE Ltd., MADRAS.

11-33-7· Tatakulavari Street :··: VIJAYAWADA-1.

సోఫాలో కూర్చున్నారు తాతయ్య, ఆయన గదిలోకి సాధారణంగా నేను వెళ్ళను. ఇప్పుడే వెళ్ళాల్సివచ్చింది. ఎంతో ప్రశాంతంగా వుందా వాతావరణం. నన్ను చూసికూడా ఆయనేం పలకలేదు. ఇంక నేనే కదపాలి,

"తాతయ్యా"

"పిలిచారట"

"అవునమ్మా, చూడు. వెంటనే రమేష్ వెళ్ళిపోయే ఏర్పాటు చెయ్యి."

ఇటువంటిదే ఏదో అయి వుంటుందనుకున్నాను. అందుకే ఆశ్చర్యపోలేదునేను. కాని ఈ భారం నామీద పెట్టడం ఏం బాగలేదు.

"తాతయ్యా — మరి"

"మరింకేం చెప్పకు తల్లీ... వెళ్ళిఅతన్ని పంపించేసి ఆ తర్వాతరా నా దగ్గరకు" అన్నాడు లేచి మంచం మీదకు ఒరిగిపోతూ

ఆయన్ని చూస్తే నాకు చాలా జాలివేసింది ముసలాయన దెబ్బతిన్నాడు. ఎవర్నో పెంచుకుందామనుకోడం పాపంలాగుంది. పరాయివాళ్ళుపరాయివాళ్ళే గానీ స్వంతవాళ్ళవుతారా? ఇంకా దత్తత కాలేదు, పెంపకానికిరాలేదు అప్పుడే విల్లుగురించి, ఆస్థి గురించి అరాలాగేద్దామనుకుంటున్నాడా అఘాయిత్యపు పెద్దమనిషి. విదేశాలకువెళ్ళి నేర్చుకున్నదేమిటి? కనీసం సభ్యతగా మెలగటం, మాటాడడమైనా నేర్చుకోవద్దా? అయినా అందరూ ఇలాగే వుంటారేమిటి. ఆయన అదృష్టంఅలాంటిది ఆలోచించుకుంటూ సావిట్లోకి వచ్చాను. ఎలా చెప్పాలి రమేష్‌కి? ఎలా? నేనుచెపితే వింటాడా? నువ్వెవరివి నాకు చెప్పడానికి అంటూ కసుర్తాడా? కాని తాతయ్య మాటవిని తీరాలి నేను.

"ఏమిటీ లాయర్‌ని పిలవ మన్నారా మీ తాతగారు?" అన్నాడు సవిలాసంగా సిగరెట్ పొగ నామీదికి వదులుతూ. తాతగారి ఆస్థితో పాటు నేనుకూడా తన స్వంతమే అనుకుంటున్నాడు గామోసు!

నాకు చర్రున కోపమొచ్చింది. తాతయ్య కోసం ఈ అసభ్యాలన్నీ నేనింక భరించక్కర్లేదు.

"లాయర్నెందుకు పిలవడం?" అన్నాను.

"మరి విల్లు రాయొద్దూ?"


"ఆ అవసరం లేదు. మీకు మరోగంటలో రైలుంది. దయచేసి మీ ఊరెళ్ళిపొండి. ఆ తర్వాత తాతయ్య మీకు అన్ని వివరాలతో ఉత్తరం వ్రాస్తారు." అన్నాడు సాధ్యమైనంతవరకు నా ఉద్రేకాన్ని అణిచిపెట్టుకుంటూ.

"వాట్"

"అవును"

"ఇన్సల్ట్"

"ఇందులో ఇన్సల్ట్ ఏముంది? మీ నాన్నగారికి ఉత్తరం వ్రాస్తారు. ఏ సంగతి ఆ తర్వాత చూచుకోవచ్చు."




కోపంలో తాతగారి గదివైపు కదలి వెళ్ళబోయాడు. టక్కున తాతగారి గదితలుపు మూసి అడ్డంగా నిలబడ్డాను.

"ప్లీజ్ ఆయన్ని కదిలించకండి వంట్లో బాగ లేదు. విశ్రాంతి కావాలాయనకు." అన్నాను.

మింగేసేటట్లు నన్ను చూసి బూట్లుచప్పుడు చేసుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

మరో అరగంటకి ఇంటినుంచి కదిలాడు.

తాతయ్య రెండురోజులుదాకా మనిషి కాలేక పోయాడు. నాన్న, నేను వంతులు వేసుకుని తాతయ్యని కనిపెట్టుకునివున్నాం. రాత్రి ఏడు గంటలకు నాన్న వచ్చినప్పుడు నేను మా ఇంటికి వెళ్ళేదాన్ని. రాత్రంతా నాన్న తాతయ్య ఇంట్లోనే నిద్ర వచ్చేవరకు చదరంగం ఆడుకుంటూ, కబుర్లుచెప్పుకుంటూ.

మూడోరోజు సాయంత్రం నేను సగ్గుజావ కాచి తాతయ్యకిచ్చాను. చీకట్లు అలుముకుని మెల్ల మెల్లగా చిక్కబడుతున్నాయి.

"జావ బావుందీవేళ." అన్నారాయన కాళీ గ్లాసు బల్లమీద పెడుతూ.

"రోజూ బాగానే వుంటుందిగా" నవ్వేశాను ఆయనకూడా నవ్వేశారు.

కొంత సేపటికి అన్నారు. "నేనొకటి నిర్ణయించుకున్నాను."

మళ్ళీ ఏమిటి బాబూ! ఏం ఉపద్రవం వస్తుందోనని నాభయం.

"ఏమిటీ" అన్నాను.

కొంచెంసేపు ఏమీ మాట్లాడలేదు.

"ఏమిటి తాతయ్యా?"

"అహ... ఏమీలేదు. మురళిని పెంచుకుందా మనుకుంటున్నా" అన్నారు.

విద్యుద్ఘాతం తగిలి నట్లు ఉలికి పడ్డాను. నింగి, నేలా ఏకమయ్యాయా అనిపించి గుండె ఝల్లుమంది. నా రహస్యం నాలో అతి జాగ్రత్తగా దాచుకున్న రహస్యం అది. తాతయ్యకెలా తెలిసింది? మా ఇంట్లోనే ఎవరికి తెలియదు. మరో ఏడాదిదాకా ఎవరికి తెలియనియ్య కూడదనుకున్న ఈ సంగతి యేమైన తాతయ్యకి తెలిసి పోయింది. మురళి పేరువిన్నా, అతన్ని తలచుకున్నా నామేను పురివిప్పిన నెమిలే అవుతుంది.

"అదికాదు తాతయ్యా. మురళి..."

"అన్నీ నాకు తెలుసు. అతని కెవరూ లేరు అయినా అతని తెలివి తేటలవల్ల పైకివస్తున్నాడు. మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతుండగా అతని చదువు ఆగిపోయే స్థితిలో నువ్వు ఆదుకుని చదువు సాగేటట్లు చేశావు.. ఇంకా..."

"ఒద్దు తాతయ్యా నాకు 'చెప్పకు అన్ని విషయాలు నాకు తెలిసి పోయాయి. కానీ... అతను పేదవాడు. చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ తన్నుతాను పోషించుకుంటున్నాడు. అటువంటి వాడిని నువ్వు ఎలా పెంచుకుందామనుకుంటున్నావు?"

"నువ్వెలా ప్రేమించావో...అలాగే"

"నా సంగతివేరు. అతను మరో సంవత్సరంతో కోర్సు పూర్తి చేసుకుంటాడు. ఆ తర్వాత..."

"ఆ తర్వాత నిన్ను పెళ్ళిచేసుకుంటాడు. ఈలోపుగా అతన్ని నేను పెంచుకుంటాను. ఇందులో నా స్వార్థం ఉందమ్మా నిన్ను కోడలిగా ఈ ఇంట్లో బంధించెయ్యొచ్చు నేను, చూడు... పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసు పాడుచేసుకోకు. అన్నీ ఆలోచించాను నేను. ఇప్పుడు రమ్మని కబురంపాను.. వస్తాడిప్పుడే అడుగో... గేటు చప్పుడయింది... నీమురళి అడుగో..." 'పో'పారిపోయానక్రొపలికి.